కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -193 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 25-07-2026 | శనివారం | పేజీలు : 4

# విలీనానికి కౌంట్‌డౌన్

## ఆర్టీసీలో కొత్త అధ్యాయం



- విలీనంపై ప్రభుత్వం కసరత్తు
- డిసెంబర్ 9న కీలక ప్రకటన?
- ఆగస్టులో కార్మిక సంఘం ఎన్నికలు
- ఆర్టీసీ ఉద్యోగులకు డబుల్ గుడ్ న్యూస్
- చిరకాల కోరిక నెరవేరే దిశగా అడుగులు
- విలీన విధివిధానాలకు రంగం సిద్ధం
- పొన్నం హామీతో ఎన్నికల వేడి
- గుర్తింపు సంఘం ఎన్నికలపై ఫోకస్
- ప్రభుత్వంలో విలీనానికి గ్రీన్ సిగ్నల్?

**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల్ని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు సంబంధించి కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఓ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.. కార్మిక సంఘం ఎన్నికలు ఆగస్టు మూడో వారంలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు. అన్ని కుదిరితే డిసెంబరు 9న ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని సమాచారం. ఈలోపు విలీన ప్రక్రియకు సంబంధించిన కసరత్తు జరిగే అవకాశం ఉందంటున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బంది సమ్మె సందర్భంగా ఉద్యోగులు ప్రతిపాదించిన డిమాండ్లలో చాలావరకు నెరవేర్చింది. ఇక విలీన ప్రక్రియ మాత్రమే మిగిలి ఉంది.. అలాగే గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అందుకే ముందు గుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు జరిపి.. అనంతరం ప్రభుత్వంలో విలీనం చేపడతామని ప్రభుత్వం తెలిపింది.

మిగతాది 2 లో..

# రెండు డిమాండ్లకు ఓకే

- నేడు మరో విడత
- ధర్మేంద్రపై పట్టు
- రాజీనామా డిమాండ్ కొనసాగింపు
- విద్యార్థుల మూడు డిమాండ్లు
- నడ్డా కీలక ప్రకటన



2 లో

**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** కేంద్రం - సీజేపీ మధ్య రెండో విడత చర్చల్లో సీజేపీ ప్రతినిధులు కేంద్రం ముందు మూడు కీలక డిమాండ్లను ఉంచారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కు సీజేపీ పట్టుపడుతోంది. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్రం రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయవద్దని సీజేపీ డిమాండ్ చేసింది.

సీజేపీ డిమాండ్లలో కేంద్రం రెండు డిమాండ్లు నెరవేర్చేందుకు సానుకూలంగా స్పందించింది. ధర్మేంద్రప్రధాన్ రాజీనామా మినహా మిగతా రెండు డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పేపర్ లీక్‌లపై రాజకీయ రగడ

- బీఆర్ఎస్ హయాంపై ప్రశ్నల వర్షం
- నగరంలో కలకలం రేపిన ఫ్లెక్సీలు




2 లో

# నీట్ భద్రతపై సుప్రీం ఆరా

- కేంద్రానికి నోటీసులు
- ఎన్టీఏ అఫిడవిట్ ఆదేశం
- సంస్కరణలపై నివేదిక
- పరీక్ష భద్రతపై ప్రశ్నలు
- డిజిటల్ వ్యవస్థ ప్రతిపాదనలు
- సోమవారానికి విచారణ వాయిదా



2 లో

**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** నీట్ పేపర్ లీక్ వ్యవహారం తర్వాత పరీక్షల నిర్వహణలో చేపట్టిన సంస్కరణలు, సాధించిన పురోగతిపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, పరీక్షా వ్యవస్థలో శాశ్వత ప్రాతిపదికన సంస్థాగత మార్పులు తీసుకొచ్చేందుకు చేపట్టిన చర్యలను అఫిడవిట్‌లో స్పష్టంగా వివరించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.

# బియ్యం ధరలపై ఏపీ సర్కార్ దెబ్బ



2 లో

- ఆగస్టు 1 నుంచి విక్రయాలు
- ప్రభుత్వ కేంద్రాల్లో తక్కువ ధరలు
- సామాన్యులకు అందుబాటు ధరలు
- రూ.50కే పచ్చి బియ్యం
- రైస్ మిల్లర్ల పూర్తి సహకారం

# బిల్లుపై రాజ్యసభలో రచ్చ




2 లో

- రాజ్యసభలో వందేమాతరం బిల్లు
- సభలో రగడ.. వాయిదా నిర్ణయం
- వందేమాతరం గౌరవానికి కొత్త చట్టం
- బిల్లుపై సోమవారం పూర్తి చర్చ
- ప్రభుత్వం-విపక్షాల మధ్య ఢీ
- వందేమాతరం బిల్లుపై రాజకీయ వేడి

# ఇందిరమ్మ ఇళ్లకు రేవంత్ గ్రీన్ సిగ్నల్

- జనావాసాల్లోనే నిర్మాణం
- నిరుపయోగ స్థలాల గుర్తింపు
- ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ
- మొదటి విడత 7,680 ఫ్లాట్లు
- 17 నియోజకవర్గాల్లో నిర్మాణం



2 లో

**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల వివరాలను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# 'బీఆర్ఎస్‌ను వీడేది లేదు'

- పార్టీ మార్పుపై మల్లారెడ్డి క్లారిటీ
- ఫేక్ ప్రచారాన్ని ఖండించిన మల్లారెడ్డి
- కేటీఆర్‌పైనే మల్లారెడ్డి విశ్వాసం
- పార్టీ మార్పు ప్రచారానికి చెక్
- మీడియా ముందే స్పష్టీకరణ

2 లో

# 'గ్రూప్ రాజకీయాలు వద్దు'

- పవన్ కోసమే పనిచేద్దాం
- ప్రజల్లోనే ఉండాలి
- పార్టీ బలోపేతమే లక్ష్యం
- సమిష్టిగా ముందుకు సాగాలి
- కూటమితో సమన్వయం అవసరం
- తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



2 లో

**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** స్థానిక ఎన్నికల్లో విజయాన్ని సాధించాలంటే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ శ్రేణులకు సూచించారు. గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మోడీ ప్రభుత్వంపై సోనియా ఫైర్

- విద్యార్థులకు అండగా సోనియా
- నీట్ వివాదంపై కేంద్రానికి చురకలు
- విద్యార్థులపై వేధింపులంటూ విమర్శలు
- విద్యా విధానంపై కాంగ్రెస్ విమర్శలు
- ప్రభుత్వ తీరును తప్పుబట్టిన సోనియా
- యువతకు న్యాయం చేయాలన్న సోనియా

2 లో

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక

- జులై 26 నుంచి వర్షాల జోరు
- బ్రేక్ మాన్సూన్‌కు ఎండ్ కార్డ్
- తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక
- పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- ఉత్తర తెలంగాణలో భారీ వానలు
- రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పునరాగమనం

2 లో

# నీట్ భద్రతపై సుప్రీం ఆరా

మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా ప్రతిపాదిత గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, భద్రత, పారదర్శకత, పరిశోధన–అభివృద్ధి, మానవ వనరులు సహా 10 ప్రధాన విభాగాల్లో ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సుల అమలు వివరాలను కోర్టు కోరింది. పరీక్షల భద్రత, పర్యవేక్షణ, నిఘా కోసం కొత్తగా నియమించిన అదనపు డైరెక్టర్ జనరల్స్ పాత్ర, వారి పనితీరు పురోగతిపై నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్షకు ముందు, పరీక్ష సమయంలో, పరీక్ష తర్వాత ఇలా ప్రతీ దశలోనూ చేపట్టిన సంస్కరణలపై సమగ్ర స్టేటస్ రిపోర్ట్‌ను ధర్మాసనం డిమాండ్ చేసింది.

రవాణా, సీబీటీ విధానం..

ప్రశ్నాపత్రాల ప్రింటింగ్, రవాణా, బహుళ సెషన్ల పరీక్షలు, కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మారే ప్రతిపాదనలతో పాటు డేటా భద్రతా చర్యలను కోర్టు కోరింది. ప్రశ్నాపత్రాల సురక్షిత రవాణాకు భారత వైమానిక దళాన్ని ఉపయోగించడం కేవలం తాత్కాలిక చర్యేనని, ఇది శాశ్వత పరిష్కారం కాదని జస్టిస్ నరసింహ వ్యాఖ్యానించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల తనిఖీ కోసం 'డిజియాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై సమాధానం ఇవ్వాలని కోరింది.

అయితే, గత అఫిడవిట్‌లో ఈ విషయాలు సరిగ్గా లేవని కోర్టు వ్యాఖ్యానించగా, కొత్తగా సమగ్ర అఫిడవిట్ దాఖలు చేస్తామని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హామీ ఇచ్చారు. 'మేం దీనిని ఏడాది పొడవునా నిశితంగా పర్యవేక్షిస్తాం.. సంస్థాగత మార్పులు వచ్చేలా చూస్తాం' అని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు కేసు విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# రెండు డిమాండ్లకు ఓకే..నేడు మరో విడత

మొదటి పేజీ తరువాయి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం చెప్పేందుకు మరింత సమయం కావాలని కేంద్రం .. సీజేపీ ప్రతినిధులకు తెలిపింది.

రేపు మరో విడత చర్చలు

సీజేపీతో చర్చలు ముగిసిన అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. సీజేపీ – కేంద్రం మధ్య నేడు మరో విడత చర్చలు జరుగుతాయని తెలిపారు. కొన్ని డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు రేపటిదాకా సమయం తీసుకున్నామని వెల్లడించారు. విద్యార్థులు మూడు డిమాండ్లను తమ ముందు ఉంచారని, వాటిపై కీలకంగా చర్చించాల్సి ఉందని తెలిపారు.

ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేసి తీరాల్సిందే..

మరోవైపు సీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై వెనక్కి తగ్గేదే లేదని కేంద్రానికి స్పష్టంగా చెప్పామన్నారు. తమ డిమాండ్లపై శనివారం మధ్యాహ్నం లోగా చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ ఉద్యమం ఆగదన్నారు. ఆయన రాజీనామా చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించే బాధ్యత ప్రధాని నరేంద్రమోదీదే అని సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఆయనతో రాజీనామా చేయించలేని పక్షంలో.. మోదీనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని కుండబద్దలు కొట్టారు.

# పేపర్ లీక్‌లపై రాజకీయ రగడ




**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** నీట్ పరీక్షల అక్రమాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దు ఘటనలను గుర్తుచేస్తూ కేటీఆర్‌కు వ్యతిరేకంగా నిలదీస్తున్నట్లుగా వెలిసిన ఫ్లెక్సీలు కలకలం సృష్టిస్తున్నాయి. అయితే ఆ పోస్టర్లలో 'మీ ప్రభుత్వంలో జరిగిందేంటి కేటీఆర్?' అని హెడ్డింగ్ రాసి ఉంది. అదేవిధంగా సంవత్సరాల వారీగా పేపర్ల లీక్‌ను ఆ ఫ్లెక్సీలో క్లియర్‌గా ప్రస్తావించారు. జూలై 2016: ఎంసెట్–2 (మెడికల్) పేపర్ లీక్, 2018: వాట్సాప్‌లో పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ, మార్చి 2023: తీవ్ర సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్, 3 ఏప్రిల్, 2023: వికారాబాద్ జిల్లా తాండూరులో పదో తరగతి తెలుగు పేపర్ లీక్, 4 ఏప్రిల్, 2023: హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో పదో తరగతి హిందీ పేపర్ లీక్, ఏప్రిల్ 2023: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో రవాణాలో ఉండగా 30 పదో తరగతి సమాధాన పత్రాల బండిల్ మాయం లాంటి అంశాలను ప్రస్తావించారు.

కేటీఆర్‌కు సూటీ ప్రశ్న..

అయితే, కేటీఆర్ ఫొటోతో ఏర్పాటు చేసిన పోస్టర్ అడుగున ('ఔనారూ ణ×ణ˜ాఖ= +ూఃు ణూ˜ాదీూఖ ×ు ఖ=?') రాష్ట్రంలో జరిగిన పేపర్ లీకేజీలపై మీ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది కేటీఆర్? అని రాసి రాసి సూటిగా ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది. ప్రస్తుతం నగరం నడిబొడ్డున వెలిసిన ఫట?క్సీ ఉన్న ప్లకార్డుతో కేటీఆర్‌ను నేరుగా ప్రశ్నించారు. ప్రస్తుతం నగరం నడిబొడ్డున వెలిసిన ఫ్లెక్సీలు రాష్ట్రంలో పొలిటికల్ హీట్‌ను పెంచేస్తున్నాయి.

# బియ్యం ధరలపై ఏపీ సర్కార్ దెబ్బ



**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** రాష్ట్రంలో బియ్యం ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రైతు బజార్లు, ప్రభుత్వ విక్రయ కేంద్రాల ద్వారా నిర్ణీత ధరలకు బియ్యం విక్రయించనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. రాష్ట్రంలో పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రైతు బజార్లు, ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లో బీపీటీ, కేఎన్ఎం ( స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, పచ్చి బియ్యాన్ని (రా రైస్) కిలో రూ.50కు విక్రయించనున్నారు.

ఈ చర్యతో మార్కెట్లో బియ్యం ధరలు నియంత్రణలోకి రావడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ నిర్ణయానికి పూర్తి సహకారం అందిస్తామని, నిర్ణయించిన ధరలకే బియ్యం సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రికి హామీ ఇచ్చారు. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సామాన్య ప్రజలపై ధరల భారం పడకుండా చూడడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బియ్యం ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేస్తే మార్కెట్లో ధరలు స్థిరపడటంతో పాటు ప్రజలకు అందుబాటు ధరల్లో బియ్యం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'బీఆర్ఎస్‌ను వీడేది లేదు'



**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** పొలిటికల్ సర్కిల్స్‌లో పార్టీ మార్పుపై జరుగుతున్న ఊహాగానాలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఎండ్‌కార్డ్ వేశారు. శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో అందరినీ నవ్విస్తూ ఆయన ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను ఏ పార్టీలోకీ వెళ్లడం లేదని స్పష్టం చేశారు.

తాను బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ఫేక్ న్యూస్ అని మల్లారెడ్డి కొట్టిపారేశారు. తాను పార్టీ మారుతున్నాననే ప్రచారాన్ని నమ్మి ఓ అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తాను తీవ్ర ఆవేదనకు లోనయ్యానని పేర్కొన్నారు. త్వరలోనే లేఖ రాసిన వ్యక్తిని స్వయంగా కలిసి మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్ 125 ఏళ్లు బతకాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన లక్ష్యమని మల్లారెడ్డి కామెంట్ చేశారు.

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక




**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావంతో గత కొన్ని రోజులుగా 'బ్రేక్ మాన్సూన్' పరిస్థితి కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా వాతావరణ నిపుణుడు తెలంగాణ వెదర్‌మ్యాన్ ప్రకారం ఈ పరిస్థితి ముగియనుంది. తాజా అంచనా ప్రకారం రాష్ట్రంలో వర్షాలు మళ్లీ ప్రారంభం కానున్నాయని వెదర్ మ్యాన్ అలర్ట్ జారీ చేశారు. శనివారంతో ఈ పొడి వాతావరణం ముగిసి, జులై 26 (ఆదివారం) నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈ తాజా అలర్ట్ ప్రకారం.. ఉత్తర, తూర్పు, పశ్చిమ, మధ్య తెలంగాణ జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

# 'గ్రూప్ రాజకీయాలు వద్దు'



**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** స్థానిక ఎన్నికల్లో విజయాన్ని సాధించాలంటే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ శ్రేణులకు సూచించారు. గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మనమంతా పవన్ కల్యాణ్ కోసమే పనిచేస్తున్నాం.. గ్రూప్ రాజకీయాలు వద్దు అని స్పష్టం చేశారు..

గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుకూల పరిస్థితులు లేకపోయినా జనసేన పార్టీ బలంగా నిలబడిందని ఆయన గుర్తు చేశారు. విజయవాడలో 39 డివిజన్లలో పోటీ చేసి సుమారు 50 వేల ఓట్లు సాధించడం పార్టీ బలానికి నిదర్శనమన్నారు. ఆ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల త్యాగాలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు మనోహర్.. రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ముందుగానే వ్యూహాత్మకంగా పనిచేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ కంటే వ్యక్తిగత నమ్మకం, ప్రజలతో అనుబంధానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులకే ప్రజలు మద్దతు ఇస్తారని అన్నారు.

కేవలం కార్లలో తిరగడం, భారీ బ్యానర్లు ఏర్పాటు చేయడం వల్ల ఓట్లు రావని, ప్రజా సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేసినప్పుడే ప్రజల విశ్వాసం పొందగలమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పార్టీ క్యాడర్‌ను కలుపుకొని సమిష్టిగా పనిచేయాలని సూచించారు. జనసేన నాయకులు, కార్యకర్తలందరూ పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ నాయకత్వాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. పార్టీ లోపల గ్రూప్ రాజకీయాలకు ఎలాంటి అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు.

ప్రస్తుతం జనసేన కూటమిలో భాగంగా ఉందని, అన్ని పదవులను ఒకేసారి ఆశించడం సరికాదని పేర్కొన్నారు నాదెండ్ల మనోహర్.. కూటమిలోని ఇతర పార్టీలు చాలా కాలంగా రాజకీయాల్లో ఉన్నాయని, వారితో సమన్వయంతో పనిచేస్తూ జనసేనను క్రమంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో జనసేన పార్టీ, పవన్ కల్యాణ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ప్రజల్లో వాస్తవాలను తీసుకెళ్లి పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు మంత్రి నాదెండ్ల మనోహర్..

# మోడీ ప్రభుత్వంపై సోనియా ఫైర్




**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ అక్రమాలకు వ్యతిరేకంగా విద్యా సంస్కరణలు, ప్రభుత్వ జవాబుదారీతనం కోరుతూ ఆందోళన బాట పట్టిన విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా ప్రవర్తిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రముఖ ఆంగ్ల పత్రికకు రాసిన ప్రత్యేక వ్యాసంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అందులో "న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న దేశ యువత ధైర్యానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పిరికిపంద చర్యలు, తీవ్రమైన క్రూరత్వం తో సమాధానమిస్తోంది.

విద్యార్థులను దేశ భవిష్యత్తును నిర్మించే వారసులుగా కాకుండా 'దేశ శత్రువులు'గా పరిగణిస్తూ వేధింపులకు గురిచేస్తోంది. మోడీ ప్రభుత్వం దేశ విద్యా రంగాన్ని తీవ్రంగా దిగజార్చడమే కాకుండా.. బాధ్యతారాహిత్యం, స్వయం మోహం, పరమ నిర్లక్ష్యంతో వ్యవహరించడాన్ని ఒక అలవాటుగా మార్చుకుంది. ఇలాంటి క్లిష్ట సమయంలో విద్యార్థులకు అండగా నిలబడి వారి భవిష్యత్తును కాపాడటం మనందరి నైతిక, రాజకీయ, రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక బాధ్యత" అని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

# బిల్లుపై రాజ్యసభలో రచ్చ




**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** పార్లమెంట్ వేదికగా మరో కీలక బిల్లుపై రగడ మొదలైంది. దేశభక్తి గేయమైన వందేమాతరం గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన వందేమాతరం బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ శుక్రవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం వందేమాతరాన్ని అవమానించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం రూపకల్పన చేశారు. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే జైలుశిక్ష విధించడంతో పాటు, ఇకపై ఈ గేయాన్ని ఎక్కడ ఆలపించినా పూర్తిగా మాత్రమే పాడాలనే కఠిన నిబంధనను కూడా బిల్లులో పొందుపరిచారు.

విపక్షాల నిరసన – సభ తీవ్ర వాయిదా

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. బిల్లులోని నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ విపక్ష సభ్యులు సభలో నిరసనకు దిగారు. దీంతో విపక్షాల ఆందోళనతో సభా కార్యక్రమాలు స్తంభించిపోవడంతో, చైర్మన్ రాజ్యసభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వందేమాతరం బిల్లుపై సోమవారం సభలో పూర్తిస్థాయి చర్చ జరగనుంది. ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చాలని పట్టుదలతో ఉండగా, ప్రతిపక్షాలు మాత్రం తమ నిరసనను కొనసాగించే అవకాశం కనిపిస్తోంది.

# ఇందిరమ్మ ఇళ్లకు రేవంత్ గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట సంబంధిత శాఖలకు స్థలాన్ని కేటాయించాలని సీఎం ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు.

క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు 11 లక్షల రూపాయల ఖర్చవుతుండగా.. ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల భారీ సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన 6 లక్షల రూపాయలను లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ల్యాండ్ కాస్ట్‌ను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7 వేల 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. సంబంధిత నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ సెక్రెటరీ లోకేష్ కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌజింగ్ స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విలీనానికి కౌంట్‌డౌన్..ఆర్టీసీలో కొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి



ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో కార్మిక సంఘాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే డిపోల వారీగా ప్రచారం కూడా ముమ్మరం చేశాయి. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గెలిచిన సంఘాన్ని విలీనానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని ప్రకటించడంతో కార్మిక సంఘాలు ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడుతున్నాయి. డిసెంబరు 9న విలీన ప్రక్రియ తుది ప్రకటన చేసే అంశంపై ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు సమాచారం. మొత్తం మీద తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల కోరిక అయిన ప్రభుత్వంలో విలీన ప్రక్రియ కల నెరవేరబోతోంది.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. ఏపీ-కర్ణాటకకు శుభవార్త



**న్యూస్ డెస్క్, 24 జూలై (బీఎన్ఎస్):** ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం కేంద్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశమై పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార ప్రసార, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

ఏపీ – కర్నాటక మధ్య కొత్త రైల్వే లైన్లు..

తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న కర్నాటకకు ప్రయోజనం చేకూర్చేలా రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. బళ్లారి – గుంతకల్లు మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రూ1,264 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్ట్‌ను మూడేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏపీ, కర్నాటక సరిహద్దుల్లోని దాదాపు 99 గ్రామాలకు మెరుగైన రైల్వే అనుసంధానం లభించనుంది. ఇందులో భాగంగా వేదవతి నదిపై భారీ రైల్వే వంతెన నిర్మాణానికి కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది.

రూ.3,030 కోట్లతో భవ్య రసాయన పథకం..

దేశంలో రసాయన పరిశ్రమల పురోగతికి ప్రత్యేక ప్రోత్సాహకాలను కేబినెట్ ప్రకటించింది. దేశంలో కెమికల్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.3,030 కోట్లతో 'భవ్య రసాయన పథకానికి' ఆమోదం లభించింది. ఈ పథకంలో భాగంగా ఏర్పాటు చేసే ఒక్కో కెమికల్ పార్కుకు రూ.1,000 కోట్ల చొప్పున నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

పేపర్ లీకైపై కఠిన చట్ట సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్..

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని అరికట్టేందుకు కేంద్రం తీవ్రంగా పరిగణించింది. పేపర్ లీక్ నిరోధక చట్ట సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణల ప్రకారం, పోటీ పరీక్షల పేపర్ లీకేజీకి లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటారు. లీకేజీలకు పాల్పడితే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే వెసులుబాటును ఈ కొత్త చట్టంలో కల్పించనున్నారు.

# విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## టిడిపి నేత తిక్కమనేని ప్రసాద్ నాయుడు



సంస్కారం, నైతిక విలువలు చాలా ముఖ్యమని, అవే వారి బంగారు భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు.?అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులు టెక్నాలజీని సరైన మార్గంలో సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితోపదేశం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'విజన్ 2047' దార్శనికతను, పాలనా దక్షతను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.?చివరగా, విద్యార్థులు చదువులో బాగా రాణించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పేరెంట్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

## పనులను త్వరగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌లి



నల్లగొండ (బీఎన్ఎస్):

సూర్యాపేట మీదుగా జరుగుతున్న హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులను నిర్దేశిత గడువులోగా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు.. సూర్యాపేట జిల్లా పరిధిలో జరుగుతున్న 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారుల అథారిటీ (NHAI) అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని, నాణ్యతను తనిఖీ చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణ చేపట్టాలి

## -- నల్గొండ మండల ప్రత్యేక అధికారి డా. జి.వి. రమేష్



నల్లగొండ (బీఎన్ఎస్): ఎల్నినో ను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని నల్లగొండ మండల ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.వి. రమేష్ సూచించారు... నల్గొండ మండలం రసూల్‌పురం గ్రామపంచాయతీలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఈ వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడంతో నీటి లభ్యత పరిమితంగా ఉంటుందని తెలిపారు. ఈ పరిస్థితులలో

ముఖ్యంగా బోర్ల కింద వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే కంది, మినుములు, నువ్వులు వంటి ఆరుతడి పంటలు, కూరగాయల సాగు వంటి పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని రైతులకు సూచించారు. కురిసే స్వల్ప వర్షపు నీటిని కుడా వృథా కాకుండా ప్రతి రైతు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు మరియు నీటి నిల్వ కుంటలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించుకోవాలని తెలిపారు.

# ఆందోళన వద్దు..!: ఆర్టీసీ యాజమాన్యం విజ్ఞప్తి



హైదరాబాద్ (బీఎన్ఎస్): టీజీఎస్ ఆర్టీసీ పరిధిలో సేవలు అందిస్తున్న అద్దె బస్సు యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. ఆర్టీసీలో అద్దె బస్సుల కొనసాగింపు మరియు నిర్వహణకు సంబంధించిన అన్ని నిర్ణయాలు ప్రభుత్వ ఆదేశాలకు, సంస్థ నిబంధనలకు లోబడి అత్యంత పారదర్శకంగా తీసుకోబడతాయని తెలిపింది. కాబట్టి యజమానులు ఎటువంటి అభద్రతాభావానికి గురికావాల్సిన అవసరం లేదని పేర్కొంది.

ఈ క్రమంలో కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అద్దె బస్సు యజమానులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేయడంతో పాటు ప్రభుత్వం, ఆర్టీసీ లో అధికారులను మేనేజ్ చేయడానికి డబ్బు అవసరమని అద్దె బస్సు యజమానుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఇటువంటి వదంతులు మరియు దుష్ప్రచారాల వల్ల యజమానుల ప్రయోజనాలకే తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఆర్టీసీలో అన్ని నిర్ణయాలు అత్యంత పారదర్శకంగా తీసుకోవడం జరుగుతుంది. కాబట్టి అద్దె బస్సు యజమానులందరూ అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక ప్రచారాలను గానీ, సంఘాల మాటలను గానీ నమ్మి ఎవరూ మోసపోవద్దని సవినయంగా కోరుతోంది. సంస్థ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా పరిగణించాలని సూచించింది. అనవసర ప్రచారాలకు లొంగి సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే దానికి సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేస్తూ, ప్రశాంత వాతావరణంలో సంస్థతో సహకరించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కోరుతోంది.

# ఎట్టకేలకు కౌలు రైతుకు న్యాయం..

## కొత్తపేట డీఎస్పీ మురళీకృష్ణ జోక్యంతో పొలంలోకి వెళ్లిన రైతు



పసుపల్లి (బీఎన్ఎస్) జూలై: 24అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామంలో కౌలు రైతు తన సాగు భూమిని ఎట్టకేలకు తిరిగి దున్నుకునే అవకాశం లభించింది. కొంతమంది వ్యక్తులు భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో కౌలు రైతును సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు అందడంతో కొత్తపేట డీఎస్పీ మురళీకృష్ణ వెంటనే స్పందించారు.

వివరాల్లోకి వెళితే, గత 30 సంవత్సరాలుగా పులిమే శివరామ్ దీక్షితులు అనే వృద్ధ భూయజమాని సదరు భూమిని సాగు చేసుకుంటూ వస్తున్నారు. ఆయన 10 ఏళ్ళు గా ఆ భూమిని వక్కపట్ల వీరన్న అనే రైతుకు కౌలుకు ఇచ్చారు. అయితే అదే భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు వేంకటేశ్వరరావు మరియు ఆయన కుమారుడు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భూమిలో మట్టి గుట్టలు వేసి కౌలు రైతు వ్యవసాయ పనులకు ఆటంకం కలిగించడంతో పాటు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని భూయజమాని, కౌలు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదుపై స్పందించిన కొత్తపేట డీఎస్పీ మురళీకృష్ణ వెంటనే కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం అంబాజీపేట ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. కౌలు రైతు సాగుకు ఎటువంటి ఆటంకం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

దీంతో కౌలు రైతు తిరిగి తన పొలాన్ని దున్నుకోవడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతుల సంఘం కొత్తపేట డీఎస్పీ మురళీకృష్ణతో పాటు అంబాజీపేట పోలీసుల తక్షణ స్పందనను అభినందించింది.

అలాగే గ్రామస్తుల సహకారం వల్ల అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ఫలించలేదని కౌలు రైతు వీరన్న తెలిపారు. చట్టంపై నమ్మకంతోనే తాము ముందుకు వచ్చామని, పోలీసుల జోక్యంతో న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

# వెంకటగిరి నుంచే పోటీ చేస్తా నేదురుమల్లి



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (బి.యన్.యస్):– వెంకటగిరి నియోజకవర్గాన్ని విడిచి వెళ్లే ప్రసక్తే లేదని.. వచ్చే ఎన్నికల్లో కూడా వెంకటగిరి నుంచే పోటీ చేస్తానని వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.అదేవిధంగా తాను ఎంపీగా వెళ్తున్నానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు.అదేవిధంగా వైఎస్సార్సీపీలో ఆనం టీం కోవర్ట్ రాజకీయాలకు తావు లేదని.. పార్టీలో ఉంటూ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కార్యక్రమాలకు హాజరుకాకపోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.

వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనకుండా వైఎస్సార్సీపీలో కొనసాగేందుకు అర్హత లేదని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి ద్వారా దర్శనం టికెట్లు పొందుతూ.. అదే సమయంలో వైఎస్సార్సీపీలో కొనసాగుతున్న వారి వ్యవహారంపై పార్టీకి పూర్తి సమాచారం ఉందని వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పాలనలో ప్రజలపై భారాలు మోపుతూ.. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలు దేవాదాయ శాఖ, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇసుక--గ్రావెల్ అక్రమాలు ద్వారా అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో చేపట్టిన నాడు--నేడు పనులకు మళ్లీ బిల్లులు పెట్టి కోట్ల రూపాయలు చెల్లిస్తున్నారని విమర్శించారు.

అక్రమాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని.. ప్రశ్నించే హక్కును కూడా హరించే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు.అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూ అక్రమాలపై పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఒక్కో అంశాన్ని ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు. అదేవిధంగా

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని.. కేవలం మూడు రోజుల్లోనే ఐదు వేల మందికి పైగా సంతకాలు చేశారని తెలిపారు.

# పెన్‌డౌన్ ప్రభావం లేదు..

## కొత్తపేటలో యథావిధిగా రిజిస్ట్రేషన్లు

**దస్తావేజుల లేఖరుల ఆందోళనతో సేవలకు అంతరాయం లేదన్న సబ్-రిజిస్ట్రార్ -- ప్రజలు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచన**




కొత్తపేట, (బీఎన్ఎస్) జూలై 24: రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల (RSK) ఏర్పాటుకు వ్యతిరేకంగా దస్తావేజుల లేఖరులు చేపట్టిన పెన్‌డౌన్ ఆందోళన ప్రభావం కొత్తపేట సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించడం లేదని సబ్–రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

పెన్‌డౌన్ కారణంగా రిజిస్ట్రేషన్ సేవలకు ఎలాంటి అంతరాయం లేదని, ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకావాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వారు నేరుగా కార్యాలయ సిబ్బందిని సంప్రదించి అవసరమైన వివరాలు అందజేస్తే, సిబ్బందే పబ్లిక్ డేటా ఎంట్రీ, స్లాట్ బుకింగ్, తదితర ప్రక్రియలను పూర్తి చేసి రిజిస్ట్రేషన్ నిర్వహిస్తారని తెలిపారు.

ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి సేవలను పొందాలని ఆయన సూచించారు. ప్రస్తుతం కార్యాలయంలో అన్ని రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని, పెన్‌డౌన్ కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని ఆయన పేర్కొన్నారు.

# నషా ముక్త్ యువ వికసిత్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ



నల్లగొండ (బీఎన్ఎస్): భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించే నషా ముక్త్ యువ వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా 8రకాల కాంపిట్ నిర్వహిస్తోందని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు.. మైభారత్ కేంద్ర నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 28వ తేదీన నల్లగొండ లోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమంలో యువతకు 8 రకాల అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు..

మరిన్ని వివరాల కొరకు 9848666536, 9059798602 నెంబర్లలో సంప్రదించ వలసిందిగా కోరారు..

# విజయనగరంలో ఆసక్తికర రాజకీయ పరిణామం..

విజయనగరం రాజకీయ వర్గాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తల్లి కృష్ణవేణమ్మ ఇటీవల మృతి చెందగా.. ఆమె సంతాప సూచకంగా మాజీ ఎమ్మెల్సీ, మాజీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి జగదీష్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా పరామర్శించారు.

మజ్జి శ్రీనువాసురావు తల్లి మృతి చెందిన తర్వాత తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నాయకులెవరూ అటువైపు వెళ్లకపోవడం గమనార్హం. సరిగ్గా అదే సమయంలో టీడీపీకి చెందిన సీనియర్ నేత ద్వారపురెడ్డి జగదీష్ స్వయంగా వెళ్లి పరామర్శించడం స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

పూసపాటి అశోక్ గజపతి రాజుకు అత్యంత సన్నిహిత అనుచరుడిగా, టీడీపీలో ఉమ్మడి జిల్లా రాజకీయాలను నడిపిన బలమైన నేతగా జగదీష్‌కు పేరుంది. అలాంటి సీనియర్ నేత ప్రత్యర్థి పార్టీకి చెందిన కీలక నేత ఇంటికి వెళ్లి పరామర్శించడం వెనుక రాజకీయ వ్యూహం ఏమైనా ఉందా..?అని సర్వత్రా చర్చ సాగుతోంది.



# 'పుస్తకాలే మన ప్రాణస్నేహితులు': స్విస్ లో 'మీట్ ది ఆథర్'..!!





హైదరాబాద్ (బీఎన్ఎస్): హైదరాబాద్

శ్రీ శారదా ధామంలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో 4, 5 తరగతుల విద్యార్థులకు "మీట్ ది ఆథర్" (రచయితతో ముఖాముఖి) కార్యక్రమాన్ని అత్యంత స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పుస్తకపఠనంపై ఆసక్తిని పెంచడం, సృజనాత్మక రచనను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల వాతావరణంలో విజ్ఞాన పరిమళాలు నింపిన ఈ సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ నేతృత్వం వహించి విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడంలో, నైతిక విలువలతో కూడిన సమగ్ర విద్యను అందించడంలో ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ వినూత్న కార్యక్రమాలకు చొరవ చూపుతున్నారు.

ఈ సదస్సుకు ప్రముఖ రచయిత మరియు శాస్త్రవేత్త చిట్టూరి వేణుగోపాల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "పుస్తకాలే మన ప్రాణస్నేహితులు" అనే అంశంపై ఆయన మాట్లాడారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరగడమే కాకుండా, ఆలోచనా పరిధి విస్తరించి, మంచి వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుందని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సొంతంగా కథలు రాయడం అలవాటు చేసుకోవాలని, భవిష్యత్తులో మంచి రచయితలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా తమ సొంత కథల పుస్తకాలను స్వయంగా రాశామని విద్యార్థులు తెలిపి అతిథిని ఆశ్చర్యపరిచారు. పిల్లల ప్రతిభను, సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని ఆత్మీయంగా అభినందించిన వేణుగోపాల్ రావు.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ కథలను పుస్తకాలుగా ప్రచురించాలని సూచించారు. అనంతరం విజ్ఞానం, ఎదుగుదలకు ప్రతీకగా పాఠశాల యాజమాన్యం ఆయనకు మొక్కను బహూకరించి ఘనంగా సత్కరించింది.

ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అనురాధ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ

**ప్రతి శుక్రవారం ప్రత్యేక సేవలు**

**రూ.500/- తో సేవా టికెట్ పొందే అవకాశం**

**మనమిత్ర' వాట్సప్ యాప్ ద్వారా సేవల బుకింగ్: ఈఓ జనార్దన్ రెడ్డి**



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నందు శుక్రవారం సందర్భంగా శ్రీ నరసింహస్వామి, శ్రీ ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున 5:00 గంటలకు శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు శ్రీ స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) కన్నులపండువగా నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆలయ ఈఓ (కార్యనిర్వహణాధికారి) కొవ్వూరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రంలో ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక సేవలు నిరంతరాయంగా జరుగుతాయని తెలిపారు.ఈ సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500/- చెల్లించి రశీదు పొంది సేవలో పాల్గొన్న భక్తుల పేరున గోత్రనామాలతో అర్చన జరిపి, స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు 1 కేజీ పులిహోరను భక్తులకు ప్రసాదముగా అందజేశారు. ?భక్తులకు స్వామివారి సేవలు మరింత త్వరగా, సులభతరంగా అందుబాటులోకి తెచ్చేందుకు దేవస్థానం వారు సరికొత్త సాంకేతికతను జోడించారు. భక్తులు 'మనమిత్ర' వాట్సప్ నెంబర్ (9552300009) ద్వారా శ్రీవారి సేవల్లో డిజిటల్‌గా పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించవచ్చని ఈఓ తెలిపారు. ఈ అద్భుత అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

# నిత్యాన్నధానంకి విరాళం




నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):-ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నిత్యాన్నధానం పథకం అభివృద్ధికి నెల్లూరు రూరల్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ వాస్తవ్యులు కుంచం సురేష్ మరియు కుటుంబ సభ్యులు స్వామి వారి నిత్యాన్నధానం పథకంకి 50,116/- అక్షరాలయాబై వేల నూట పదహారు రూపాయలు నగదు రూపంలో దేవస్థానం దేవస్థానం సిబ్బందికి అందజేశారు. అనంతరం వారికి దేవస్థానం శిబ్బంది ఆలయ మర్యాదలతో శ్రీవార్ల దర్శనం స్వామివార్ల శేష వస్త్రములు మరియు ప్రసాదం అందజేశారు.

# మైదుకూరు వాసవి అమ్మవారికి ముత్యాల చీర సమర్పణ



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 24:

మైదుకూరు పట్టణంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సుమారు 2 లక్షల విలువైన ముత్యాల చీరను ఘనంగా సమర్పించారు.

ఉదయం 7.00 లకు కడప రోడ్డులోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్యాల చీరను ఊరేగింపుగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి అమ్మవారి శాలకు తీసుకువెళ్లారు.

ముత్యాల చీరను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు శ్రీ బల్లాన్ని చెన్నకేశవ ప్రసాద్ మరియు వారి కమిటీ సభ్యులకు మహిళా మండలి అధ్యక్షురాలు బల్లాని సునంద వారి కమిటీ సభ్యులు అందజేశారు.

అనంతరం ఆలయంలో 108 మంది మహిళలతో వడిబియ్యం సమర్పణ మరియు విశేష కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో బల్లాన్ని చెన్నకేశవ ప్రసాద్ అధ్యక్షులు దొంతు వెంకటసుబ్బయ్య, పేరురు నాగరాజ ఉపాధ్యక్షులు కోట అశోక్ కుమార్ సెక్రటరీ దరిశా శ్రీనివాసులు కోశాధికారి యెలిశెట్టి గురు ప్రసాద్ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పుట్టా శివ జాయింట్ సెక్రటరీ నూకల సత్యనారాయణ మండల సంఘం అధ్యక్షులు వంకదార శ్రీనివాసులు, కోటా సంజీవరాయ గుప్తా, ఇమ్మిడిశెట్టి సతీష్, మలిపేద్దు హరినాధ్, కుప్పం కిషోర్ ఆర్యవైశ్య యువజన సంఘం పుట్టా సాయి అధ్యక్షులు, తులసి సత్య సాయి, భూపాలం ఉపేంద్ర, జొన్నలగడ్డ మనోజ్ ఆర్యవైశ్య మహిళా మండలిఅధ్యక్షురాలు బల్లాని సునంద బచ్చు శ్రీదేవి, వంకదార వాసంతి మండల అధ్యక్షురాలు మరియు ఇతర మహిళా మండలి, ఆర్యవైశ్య సభ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంకట సాయి నగర్ కాలనీ బాక్స్ కల్వర్ట్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, రామంతపూర్: రామంతపూర్ భగాయత్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన బాక్స్ కల్వర్ట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శు క్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నూతన కమిటీ సభ్యులు, గౌరవ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, వెంకట సాయి నగర్ కాలనీ అభివృద్ధికి తను పూర్తి సహకారం అందిస్తానని వారు అన్నారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, కొన్ని వీధుల్లో డ్రైనేజీ లైన్ల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని, అవసరమైన నిధులను మంజూరు చేయించి అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు, ఎండి జాంగీర్, నాయకులు, డాక్టర్ బి వి చారి ,కాలనీ అధ్యక్షుడు ఎ. విజయేందర్ రెడ్డి, సర్వ సత్తయ్య యాదవ్, రమేష్ గౌడ్, ఎం. రవికుమార్, సంజీవ్, శివశంకర్, ఆర్. గోవింద్, జి. అశోక్, సిహెచ్. శ్రీనివాస్ గౌడ్, కే. నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, విద్యాసాగర్, రామకృష్ణ, వి. శివకుమార్, ఎం. ఐలేష్ యాదవ్, బి. చలపతిరావు, బి. రాములు గౌడ్, ఎం. రమేష్ యాదవ్, , రమేష్ శెట్టి, హరీష్, వేణుగోపాల్ రెడ్డి, సోమేష్, రాములు ,స్వామి , నరేష్, తదితరులు పాల్గొన్నారు






# ఒక్క సమాచారం... మెరుపు దాడి

**మడుపల్లిలో కోడిపందేలపై అయినవిల్లి ఎస్ఐ జ్యోతి దాడి**

**ఆరుగురిపై కేసు నమోదు -- రెండు పందెపు కోళ్లు, రూ.7 వేల నగదు స్వాధీనం**



అయినవిల్లి (బీఎన్ఎస్)జూలై :24అయినవిల్లి మండలం మడుపల్లి గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో అయినవిల్లి ఎస్ఐ జ్యోతి సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. మారుమూల ప్రాంతంలో సైతం పక్కా సమాచారంతో దాడి చేపట్టిన పోలీసులు ఇద్దరు పందెపు కోళ్లతో పాటు రూ.7,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అక్రమ కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహిస్తున్న ఎస్ఐ జ్యోతి పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు.

అక్రమ కోడిపందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# భోగాపురం ఎయిర్ పోర్ట్ అనుసంధాన యాత్రను విజయవంతం చేయాలి



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగష్టు 1వ తేదీన ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో "భూమి నుండి భవిష్యత్ వరకు" పేరుతో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ తెలిపారు. ఇందులో భాగంగా "మన ఎయిర్ పోర్ట్ – మన భవిష్యత్" నినాదంతో శుక్రవారం ఉదయం 9:00 గంటలకు విజయనగరం కలెక్టరేట్ నుండి భోగాపురం ఎయిర్ పోర్ట్ వరకు వాహనాల కనెక్టివిటీ యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో వ్యాసరచన, డ్రాయింగ్, ప్రసంగ పోటీలతో పాటు యువతకు క్రీడా పోటీలు నిర్వహించి, ప్లెడ్జ్ వాల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక బ్యానర్లతో విస్తృత ప్రచారం కల్పించి ప్రజలంతా ఈ యాత్రలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. సత్తిబాబు, డి.ఐ.పి.ఆర్.ఓ. గోవిందరాజులు, డి.ఇ. ఇంద్రావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం




ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి లోకం నాగ మాధవి ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటన దృష్ట్యా ప్రతి అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, అన్ని ఏర్పాట్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

దేశ అభివృద్ధికి, ఉత్తరాంధ్ర పురోగతికి మైలురాయిగా నిలిచే ఈ ప్రతిష్ఠాత్మక విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.

# మెగా పీటీఎంలో రాష్ట్ర స్థాయి విజేత విద్యార్థికి ఘనసత్కారం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 24

మైదుకూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు రామమోహన్ అధ్యక్షతన నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ పీటీఎం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రతిభా ప్రోత్సాహానికి వేదికగా నిలిచిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఐఈడీ విద్యార్థి ఎన్. భద్రను మెడల్, ప్రశంసాపత్రం, నగదు పారితోషికంతో ఘనంగా సత్కరించారు. సత్కార కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ.. ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు ఎస్. సునీత మేడం అందించిన నిరంతర శిక్షణ, ఆప్యాయత, ప్రోత్సాహం, సహకారం వల్లే మా కుమారుడు ఈ స్థాయికి చేరుకున్నాడు. ఆమె చూపిన అంకితభావం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు అంటూ కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల మాటలు సభలోని అందరినీ కదిలించాయి.

. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కీలకమని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో విద్యార్థిని తీర్చిదిద్దిన ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు ఎస్. సునీతను అభినందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ ఆవుల శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, సీనియర్ ఉపాధ్యాయులు రాముడు, పద్మజ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మైదుకూరులో విద్యాసంస్థల బంద్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 24:

మైదుకూరు పట్టణంలోనీ గవర్నమెంట్, ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్య సంస్థల బంద్ ను విజయవంత చేయడం జరిగింది,నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్టిఏను రద్దు చేయాలి అని కోరుతూ, మైదుకూరులో బంద్ ఉద్దేశించి వివిధ పాఠశాలలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడటం జరిగింది.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాహుల్ మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను కాపాడాల్సింది పోయి విద్య వ్యవస్థను నాశనం చేస్తుంది, నీట్ పేపర్ లీకేజ్ పై దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి. కానీ బీజేపీ ప్రభుత్వంకి చీమకుట్టినట్టు కూడా లేదు, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దాదాపు నెల రోజులుగా విద్యార్థులు యువకులు పెద్ద ఎత్తున నిరసనలు, పోరాటాలు చేస్తున్నారు. సమస్య పరిష్కరించక పోగా కేంద్ర ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను వారి చేతుల్లో పెట్టుకొని విద్యార్థులపై లాఠీ చార్జీలు, చిన్నలు, పెద్దలు ఆడవాళ్ళు అని చూడకుండా రక్తం వచ్చేలాగా దాడులు చేశారు, ప్రముఖ పర్యావరణవేత్త సోనం వాంచుక్ విద్యార్థి పక్షాన నిరాహార దీక్ష చేస్తుంటే వారిని బలవంతంగా దీక్ష నుండి తీసుకువెళ్లడం జరిగింది, దేశంలో ఉన్న నాయకులు, విజ్ఞానవేత్తులు, విద్యార్థులకు యువతకు సంఘీభావంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వ్యవహరిస్తుంది. అయిన కూడా యువత విద్యార్థులు వారి ఉద్యమాలు ఆగలేదు, విద్యార్థులకు న్యాయం చేసేంతవరకు దేశంలో రాష్ట్రంలో ఉద్యమాలు ఆగవని, కావున నీట్ పేపర్ లీక్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ల లిక్ కారణంగా మరణించిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని, దేశంలో ఇంక ఎప్పుడు పేపర్ లిక్ కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్ పిలుపులో భాగంగా మైదుకూరు పట్టణంలో విద్యాసంస్థలకు బంద్ ను విజయవంతం చేయడం జరిగింది. అలాగే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో దేశంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, రాబోవు ఉద్యమా పోరాటాలలో కలిసికట్టుగా రావాలని తెలియజేయడం జరిగింది.

అనంతరం బంద్ లో పాల్గొని విజయవంతం చేసిన విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, నాయకులకు, మైదుకూరు మండల కమిటీ తరపున విప్లవ వందనాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభినయ్, వెంకీ, సాగర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.